

ఊరు బడికి ఉరి

టెక్కలిలో తరగతుల విలీనంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. - 8లో



తోటలో వ్యక్తి ఆత్మహత్య

పాతపట్నం మండలంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెట్టుకు ఉరి పోసుకుని చనిపోయాడు. - 8లో

వైఎస్సార్‌సీపీ సమావేశం వాయిదా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీలో పలు విభాగాలకు ఇన్‌చార్జిలను నియమించారు. వారితో ఈ నెల 13న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సమావేశం నిర్వహించడానికి నిర్ణయించారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర కార్యక్రమంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం, శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన బీసీ భవన్‌ను ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

పురుషోత్తపురంలో తగ్గుతున్న డయేరియా



కాలువలో చెత్త

ఇచ్ఛాపురం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురంలో డయేరియా గురువారానికి తగ్గుముఖం పట్టింది. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జాహితా, ఇతర సిబ్బంది ఇంటింటా సర్వే చేసి వైద్య సేవలు అందజేశారు. పురుషోత్తపురంలో బావి నీరు ఉపయోగిస్తున్నారని, ఆ బావిలో చెత్త వేయకుండా చూసుకోవాలని వైద్యాధికారి జాహితా తెలిపారు. అయితే గ్రామంలో బహిరంగ మలవిసర్జన సమస్యగా ఉందని, దాన్ని అరికట్టాలని కొందరు కోరారు. కాలువల్లోనూ మురికి పేరుకుపోయి ఉందని తెలిపారు.

టెక్కలి డీఎస్పీగా భార్గవి

శ్రీకాకుళం క్రైమ్, టెక్కలి: టెక్కలి డీఎస్పీగా ఎస్.భార్గవి మర్రివాడ రానున్నారు. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న ఈమె టెక్కలిలో తొలిపోస్టింగ్ దక్కించుకోవడం విశేషం. ఈ మేరకు మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వచ్చాయి. టెక్కలిలో ఇదివరకు పనిచేసిన డీవీఎస్ఎన్ మూర్తి ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన విషయం విదితమే.

ఆర్టీసీ డ్రైవర్ ఆవేదన

సాక్షి టాస్క్‌ఫోర్స్: జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ధర్మాన రామారావు తాను మోసపోయానని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వీడియో విడుదల చేశారు. బుద్దల భాస్కరరావు అనే వ్యక్తి తనను మోసం చేశాడని ఆయన ఆరోపించారు. విడతల వారీగా రూ.68 లక్షల వరకు కాజేశాడని, పిల్లల చదువులకు ఇప్పుడు తాను ఇబ్బందులు పడుతున్నానని వీడియోలో పేర్కొన్నారు. తన లాగానే పరిసర గ్రామాల ప్రజల వద్ద కూడా డబ్బులు వసూలు చేశాడని, కూతురి పెళ్లి కోసం ఉంచుకున్న డబ్బును సైతం అతడికే ఇచ్చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. తన లాగా భాస్కరరావు మాయలో ఎవరూ పడవద్దని కోరారు. ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానని, తనకు పోలీసులు న్యాయం చేయాలని, ఇది కేవలం తన వ్యక్తిగత సమస్య అని రాజకీయాలకు సంబంధం లేదని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పోలాకి: మండలంలోని చీడివలస గ్రామంలో పాట్నూరు అప్పన్న ఇంటివద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 2.6 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌టీ సూర్యప్రకాశ రావు, సీఎస్‌డీటీ రామకృష్ణ కచ్చితమైన సమాచారం మేరకు అక్కడకు చేరుకుని బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు డీఎస్‌టీ తెలిపారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన ఫిషింగ్ హార్బర్ పనులు



"రాజకీయ జోక్యం సరికాదు



మత్స్యకారుల వలసల నిర్మూలన, జీవన ప్రమాణాల మెరుగు, ఉపాధికి బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్ ఎంతగానో అవసరం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనువైన ప్రదేశం, అవసరం గుర్తించి నిర్మాణానికి ముందుకు వచ్చింది. నిర్మాణ పనులను అసంపూర్తిగా విడిచి పెట్టటం మంచిది కాదు. అభివృద్ధి పనుల్లో రాజకీయ జోక్యం సరికాదు.

– గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

ఎన్నాళ్లీ మీనమేషాలు.. ఎందుకీ వేషాలు?

- ముందుకు సాగని ఫిషింగ్ హార్బర్ పనులు
- నిరాశలో మత్స్యకారులు
- అభివృద్ధి పనుల్లోనూ రాజకీయ జోక్యం



"పనులు ప్రారంభించాలి




కూటమి అధికారంలో వచ్చినప్పటి నుంచి ఫిషింగ్ హార్బర్ పనులు నిలిపి వేశారు. మళ్లీ వేరే స్థలంలో శంకుస్థాపన చేయాలని స్థల పరిశీలన చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేస్తే ప్రయోజనం. మత్స్యకారుల ప్రయోజనం కోసం కూటమి ప్రభుత్వం పనిచేయాలి. ప్రభుత్వ ధనం వృధా చేయటం మంచిది కాదు.

– అంబటి రాంబాబు, మాజీ సర్పంచ్, బుడగుట్లపాలెం

ఎచ్చెర్ల క్యాంపస్:

స్థలం కేటాయింపు పూర్తయ్యింది.. టెండర్లు కూడా ఎప్పుడో పిలిచేశారు.. రాతి కట్టడాలు, అంతర్గత రోడ్లు సైతం ప్రారంభమయ్యాయి.. కానీ ఈ పనులు కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వానికి మనసు రావడం లేదు. బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌పై సర్కారు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మత్స్యకారుల్లో వలసలు నిర్మూలించేందుకు, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ మంజూరు చేసింది. 2023 ఏప్రిల్ 19న పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. భావనపాడు పోర్టు ప్రారంభానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో పనులు ప్రారంభించారు.

అప్పటి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ భూమి పూజ నిర్వహించారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కూటమి వచ్చాక పనులన్నీ నిలిచిపోయాయి. కొన్నాళ్లు అటవీ శాఖ అభ్యంతరాలు అన్నారు. అటవీ భూములు విడిచి పెట్టి ప్రభుత్వ భూమిలో నిర్మించవచ్చు. ప్రస్తుతం మళ్లీ స్థలం మార్చేందుకు సర్వే చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానిక మత్స్యకారులు మండిపడుతున్నారు. అసంపూర్తిగా విడిచి పెట్టిన పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. దాదాపుగా 11 నెలల పాటు పనులు నిలిచిపోవటం ఆందోళన కలిగిస్తోంది. ఫిషింగ్ హార్బర్‌కు భూమి పూజకు ముందే రూ.366 కోట్లు టెండర్ పూర్తి చేశారు. ఈ టెండర్లను విశ్వ సముద్ర కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. ప్రస్తుతం బిల్లులు చెల్లింపులు లేక, పనులు ముందుకు సాగని పరిస్థితి కొనసాగుతుంది. సర్వే నంబర్ 504–18 లో 42 ఎకరాలు ప్రభుత్వ స్థలం కేటాయించారు.



మత్స్యకారులకు నిరాశే..

స్థానిక మత్స్యకారులు ఈ ఫిషింగ్ హార్బర్ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని పది గ్రామాల మత్స్యకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రం వీరావల్, సూరత్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్న వారు సైతం ఇక్కడకు వచ్చి పనిచేసుకోవచ్చు. నిర్మాణంలో జాప్యం మత్స్యకారులకు శాపంగా మారుతుంది. వెనుకబడిన మత్స్యకార ప్రాంతం ప్రగతికి గత ప్రభుత్వం కృషి చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

● కింగ్ కోబ్రా హల్‌చల్



కింగ్ కోబ్రాను పట్టుకున్న మహాపాత్రో

మందస మండలం భోగాపురం గ్రామంలోని హరిజనవీధి ఎంపీపీ స్కూల్ సమీపంలో గురువారం తెల్లవారు జామున భారీ కింగ్ కోబ్రా కలకలం రేపింది. దాదాపు 12 అడుగులు ఉన్న సర్పాన్ని చూసి స్థానికులు భయపడ్డారు. పిల్లలు చదువుకుంటున్న ప్రదేశంలో పాము కనిపించడంతో వణికిపోయారు. కొర్లాం గ్రామంలో ఉన్న స్నేక్ క్యాచర్ నర్సింగ్ మహా పాత్రోకు సమాచారం అందించగా ఆయన వచ్చి సర్పాన్ని పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టారు. – మందస

కిడ్నీ ఆస్పత్రి పరిశీలన



ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసలోని వైఎస్సార్ కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామారావు అనే బాధితుడిని పరామర్శించేందుకు వచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజతో కలిసి ఇన్‌పేషెంట్ విభాగం, కిడ్నీ రోగుల వార్డు, ప్రభుత్వ డయాలసిస్ యూనిట్లను పరిశీలించారు. రోజు రోజుకూ కిడ్నీ రోగులు పెరుగుతున్నారని వారికి అవసరమైన వైద్య సేవలు, మందులు పంపిణీ, ఆపరేషన్లు, పరీక్షలు, అన్ని విభాగాలను పనిచేసేలా చూడాలని అన్నారు. ఆయనతో పాటు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీటీసీలు బమ్మిడి దుర్యోధన రావు, గండు మోహనరావు, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, నాయకులు శిష్టు గోపి, దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధితో వ్యక్తి మృతి



టెక్కలి రూరల్: మండలంలోని సన్యాసిసీతాపురం గ్రామానికి చెందిన బెహరా సింహాద్రి(45)అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళం, టెక్కలిలోని ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకునేవాడు. అయితే గత రెండు రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

'ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే'



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ

పలాస: దండకారణ్యంలో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలుపుదల చేయాలని, కేంద్ర పోలీసు బలగాలను వెనక్కి రప్పించాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విన్నవించారు. కాశీబుగ్గలోని ఓ రెసిడెన్సీలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ దండకారణ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మావోయిస్టుల పేరుతో ఆదివాసీలపై దాడులు జరుగుతున్నాయని, అమాయక ప్రజలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పోలీసుల చేతిలో మృతి చెందిన రేణుక బహుజనుల బిడ్డని, ఆమె ఎప్పుడు కూడా తుపాకీ పట్టిన దాఖలాలు లేవని, ఆమె ఒక రచయిత, మేధావి అని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రకృతి వనరులను దోచుకోవడానికేనని దుయ్యబట్టారు. మానవ హక్కుల నేత ఎస్వీ కృష్ణ మాట్లాడుతూ అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టడానికి మాత్రమే ఈ ఆపరేషన్ కగార్ అని వ్యతిరేకించారు. సదస్సులో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు కేవీ జగన్నాథం, సీపీఐ ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పత్రి దానేసు తదితరులు పాల్గొన్నారు.

● పండితులకు సత్కారం



ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో గురువారం ఉదయం పండిత సదస్సు, మహాదాశీర్వచనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈఓ/డిప్యూటీ కమిషనర్ వై.భద్రాజీ వేదపండితులందరినీ ఘనంగా సత్కరించారు. భజంత్రీలు వాయించే నాయీ బ్రాహ్మణులను కూడా సన్మానించారు.

అరసవల్లి

● ఇదీ ఘనకార్యం..!



మా పార్టీ బలం ఇదీ.. అంటూ టీడీపీ చెప్పుకుంటున్న సభ్యత్వ నమోదు అసలు గుట్టు ఇలా రట్టయ్యింది. బీమా ఉంటుందని చెప్పి తోవలో వెళ్తున్న వారందరికీ వంద రూపాయలు తీసుకొని సభ్యత్వం కల్పించారు. నరసన్నపేట నియోజకవర్గంలో సభ్యత్వ కార్డుల పంపిణీ స్వయంగా ఎమ్మెల్యేనే చేపట్టారు. తీరా చూస్తే ఆ కార్డులు ఇలా రోడ్డు పాలవుతున్నాయి. గురువారం సాయంత్రం జాతీయ రహదారిపై నరసన్నపేట మండలం సత్యవరం కూడలి వద్ద నరసన్నపేట నుంచి శ్రీకాకుళానికి వెళ్లే సర్వీసు రోడ్డు పక్కన పోగుగా సభ్యత్వ కార్డులు రోడ్డుపై కనిపించాయి. వీటిని కొందరు కార్యకర్తలే వేసినట్లు సమాచారం. – నరసన్నపేట

● దిగితే భయోత్పాతం



పూండి రైల్వేస్టేషన్‌లో మధ్య ట్రాక్‌కు ప్లాట్‌ఫారం లేదు. రాత్రివేళ ఈ ట్రాక్‌పై రైలు ఆగితే దిగడానికి ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి 10 గంటల సమయంలో విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే డీఎంయూ రైలు, వేకువ జామున 5.30 గంటలకు గుణుపూర్ నుంచి కటక్ వెళ్లే ఎంఈఎంయూ పాసింజర్ రైళ్లు ఈ ట్రాక్‌పై ఆగుతుంటాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి. – వజ్రపుకొత్తూరు

● గిరిపై సత్కార్యం



గిరిజన గ్రామాల్లో సాగుకు అవసరమైన నీటి వనరులు అందించేందుకు వాటర్ షెడ్లు నిర్మించేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటుగా వివిధ శాఖల అధికారులు గురువారం టెక్కలి మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ పరిధి గిరిజన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కొండపై నుంచి వచ్చే నీటిని నిల్వ చేసేందుకు వాటర్ షెడ్లను, చెక్ డ్యాంలు నిర్మాణం చేసేందుకు గాను అనుకూలమైన ప్రాంతాలను గుర్తించేందుకు పర్యటించారు. త్వరలోనే గ్రామసభలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం టెక్కలిలో గల పట్టుమహాదేవి కోనేరు గట్టుని పరిశీలించారు. – టెక్కలి రూరల్

ఆక్రమణల గానం.. అధికారులు మౌనం



- నరసన్నపేట నడి బొడ్డున ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం
- విలువైన స్థలం కొట్టేసే వన్నాగం
- పట్టించుకోని అధికారులు







చదును చేసిన మొత్తం స్థలం (ఇన్‌సెట్లో) షాపులు వెనుక ఉన్న ప్రభుత్వ స్థలం

నరసన్నపేట:

మేజరు పంచాయతీ నరసన్నపేటలో ప్రభుత్వ భూములు స్వాహా చేస్తున్నారు. ఇప్పటి వరకూ రోడ్డు పోరంబోకు స్థలాలు, రోడ్డు మార్జిన్లలో ఉన్న ఖాళీ స్థలాలను చేజిక్కించుకున్న కూటమి కార్యకర్తలు ఇప్పుడు ఏకంగా కోట్ల విలువైన స్థలంపై కన్నేశారు. మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఎస్ఆర్ షాపింగ్‌మాల్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుట్టు చప్పుడు కాకుండా కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటు రెవెన్యూ, ఇటు పంచాయతీ అధికారులకు ఆ నోటా.. ఈ నోటా సమాచారం తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పది రోజుల క్రితం మెయిన్ రోడ్డులో సీసీ డ్రైన్‌కు రోడ్డుకూ మధ్యలో కొందరు వ్యాపారులు తమ షాపుల ముందు రాకపోలకు వీలుగా మట్టిని వేసుకుంటే పంచాయతీ అధికారులు అదే పనిగా వారం రోజుల పాటు జేసీబీ అద్దెకు తీసుకొని రోడ్డు మార్జిన్‌లో ఉన్న మట్టిని ఆక్రమణల పేరుతో తొలగించారు. ఇప్పుడు రూ.కోట్లు విలువ చేసే ఆస్తి ఆక్రమణలకు గురవుతున్నా స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 96/9 లో కాలువ పోరంబోకు స్థలం ఉంది. దీన్ని కాజేసేందుకు కుట్ర జరుగుతోంది. 1997లో అప్పటి టీడీపీ ప్రభుత్వ కాలంలో ఒక సీనియర్ కార్యకర్తకు ఈ సర్వేలో ఉన్న ఐదు సెంట్లు భూమిని మార్కెట్ ధరకు కట్టబెట్టారు. తర్వాత ఆ స్థలంలో ఆయన షాపులు నిర్మించుకొని ఇన్నాళ్లూ ఉన్నారు. అప్పటి నుంచీ ఈ షాపుల వెనుక భాగం ఖాళీగానే ఉండేది. పాత ఇనుము సామాన్లు సేకరించే ఒకాయన తాత్కాలిక పద్ధతిలో చిన్న రేక్ షెడ్ వేసుకొని ఉండేవాడు. ఈ స్థలంలో పక్కాగా ఆయన షాపులు నిర్మించేందుకు గత ప్రభుత్వ కాలంలో ప్రయత్నించగా అప్పటి సర్పంచ్, అధికారులు అంగీకరించలేదు. ఇప్పుడు అధికారం అండతో ఆ స్థలంలో ఉన్న రేకు షెడ్‌ను తొలగించి ఆ స్థలం కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో నిర్మించిన షాపులు తొలగించి ఆ స్థలంతో పాటు వెనుక ఉన్న ప్రభుత్వ స్థలం కూడా కలిపి భవంతులు నిర్మించడానికి చూస్తున్నారు. దీనికి పట్టణానికి చెందిన కొందరు టీడీపీ మాజీ ఎంపీటీసీలు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కూటమికి చెందిన నియోజకవర్గం పెద్దలు కూడా సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు సెంట్లకు పైగా స్థలం ఆక్రమణకు పాల్పడుతున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఈ ప్రాంతంలో గజం విలువ రూ.లక్షల్లో ఉంది. విలువైన స్థలం కబ్జా కాకుండా చూడాలని స్థానికు లు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలం ఎంత ఉంది, ఎక్కడ నుంచి ఉందనేది మార్కింగ్ చేయాలని, కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎస్ఆర్ షాపింగ్ మాల్ పక్క స్థలం పరిశీలిస్తామని, ఆర్ఐతో పాటు ఇతర సిబ్బందిని పంపి ప్రభుత్వ స్థలం ఎంత ఉందనేది నిర్ధారణ చేస్తామని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. ఇదే విషయంపై నరసన్నపేట ఈఓ ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా స్థలంలో ఎలాంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వ లేదని, పంచాయతీకి ఎవరూ అప్రోచ్ కాలేదని, అయితే ఆ స్థలానికి సంబంధించి ఏమైనా ఆధారాలు ఉంటే తీసుకురావాలని సంబంధిత వ్యక్తులకు సూచించామని తెలిపారు. పది రోజులైనా ఎవరూ రాలేదని, అనుమతి లేకుండా నిర్మాణ పను లు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

పత్రికా విలేకరిపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న బాలు అనే ఒక పత్రికా విలేకరి (సాక్షి కాదు) తనను డబ్బులు కోసం వేధిస్తున్నాడని నగరంలోని పెద్దరెల్లి వీధికి కల్యాణి జ్యోతిప్రసాద్ ఎస్పీకి గురువారం ఫిర్యాదు చేశారు. విలేకరి తాను పనిచేస్తున్న పత్రికలో వ్యతిరేక కథనాలు రాస్తానని భయపెడుతున్నట్లు పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులకు చెప్పి కేసులు పెట్టిస్తానని చెప్పి బ్లాక్ మెయిల్ చేసి కొంత డబ్బులు తీసుకున్నాడన్నారు. ఇంకా డబ్బులు అడుగుతుండడంతో భరించలేక తాను ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నాడు. కులం పేరుతో కూడా దూషించాడని, ఎస్పీకి సంబంధిత ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను అందించానని తెలియజేశాడు.

అదృశ్యమైన యువతులు సురక్షితం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం (స్త్రీ సదన్ మహిళా ప్రాంగణం) నుంచి బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న ఇద్దరు యువతులు మంగళవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. దీంతో స్త్రీ సదన్ ఇన్‌చార్జి సనపల సత్యవతి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత రెండు రోజులుగా వీరికోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో యువతులు కనిపించారు. దీంతో వీరిని విశాఖపట్నం ఎన్టీఆర్ నైపుణ్య అభివృద్ధి కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. యువతులు సురక్షితంగా ఉండడంతో ప్రాంగణం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

యోగా పోటీల్లో సత్తాచాటిన దంపతులు



పతకాలు అందుకుంటున్న దంపతులు

ఆమదాలవలస: పట్టణంలోని పతాంజలి యోగా శిక్షణ కేంద్రం గురువు లగుడు అప్పన్న, ఆయన సతీమణి లగుడు లక్ష్మిలు శ్రీనగర్‌లో ఈనెల 6వ తేదీన జరిగిన యోగా పోటీల్లో సత్తాచాటారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 50 సంవత్సరాల పైబడిన యోగా క్రీడా విభాగంలో వీరు వివిధ ఆసనాలు వేశారు. లగుడు అప్పన్న ఈ పోటీల్లో తృతీయస్థానం సాధించి కాంస్య పథకం పొందారు. అలాగే లగుడు లక్ష్మి ద్వితీయ స్థానంతో వెండి పతకం సాధించారు. వీరికి నేషనల్ యోగా అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రజిత్‌పాల్‌తో పాటు కమిటీ సభ్యులు పతకాలు అందజేశారు. అలాగే జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి బొడ్డేపల్లి దక్షిణా మూర్తి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు అభినందించారు.

తోటలో వ్యక్తి ఆత్మహత్య



మామిడిచెట్టుకు వేలాడుతున్న మృతదేహం

పాతపట్నం: మండలంలో పాశీగంగుపేట గ్రామ సమీపంలోని జీడి, మామిడి తోటలో అదే గ్రామానికి చెందిన బురల్లా మొఖలింగం అల్లుడు మహ్మద్ షఫీ (29) గురువారం సాయంత్రం మామిడి చెట్టుకు ఊరివేసుకుని మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాశీగంగుపేట రెల్లివీధికి చెందిన బురల్లా మొఖలింగం, అతని కుమార్తె బురల్లా రాములమ్మ 8 ఏళ్ల క్రితం బతుకుతెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ రాములమ్మకు మహ్మద్ షఫీతో పరిచయం పెరగడంతో పెళ్లి చేసుకున్నారు. కాగా ప్రస్తుతం మొఖలింగం తన కుమారుడు బురల్లా మురళీ వద్ద పాశీగంగుపేటలో ఉంటున్నాడు. మమ్మద్ షఫీ నాలుగు రోజుల క్రితం పాశీగంగుపేట గ్రామానికి మామ ఇంటికి వచ్చాడు. భార్య హైదరాబాద్‌లో ఉంది. గురువారం సాయంత్రం గ్రామస్తులు షఫీ ఆత్మహత్య చేసుకున్నాడని, పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్‌ఐ బి.లావణ్య, పోలీసులు సంఘటన స్థలంకు చేరుకున్నారు. విషయాన్ని భార్య రాములమ్మకు ఫోన్‌లో తెలియజేయడంతో ఆమె భర్త మృతి అనుమానాస్పదంగా ఉందని ఆరోపించారు. తన భర్తకు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏమీ లేదన్నారు. సంఘటన స్థలం వద్ద క్లూస్ టీమ్ విచారణ చేపట్టింది. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఊరు బడికి ఉరి..!



- తరగతుల విలీనానికి ప్రభుత్వం చర్యలు
- పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ప్రైవేటును ప్రోత్సహించడమేనని ఆరోపణలు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ఎత్తుగడలు వేస్తోంది. దీనిలో భాగంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన తల్లికి వందనం పథకం ఒక ఏడాది ఎగ్గొట్టేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ట్యాబ్‌ల నిర్వాహణను గాలికొదిలేశారు. కాగా ఇప్పుడు కొన్ని గ్రామాల్లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతులను ఎత్తివేసి, ఆయా గ్రామాలకు కొంతదూరంలో ఉన్నటువంటి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. అయితే విలీనం కోసం విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ, గ్రామస్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత చోటుచేసుకోవడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రాథమికోన్నత స్థాయి తరగతుల విలీనం విధానంతో గ్రామాల్లోని విద్యార్థులు చదువులకు దూరం కావడమే కాకుండా, పరోక్షంగా ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విలీనంతో ఇబ్బందులెన్నో...

- టెక్కలి మండలంలోని బొరిగిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మొత్తం 84 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 6 నుంచి 8 తరగతుల్లో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పుడు ఇదే తరగతులను సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే తమ గ్రామంలోని ప్రాథమికోన్నత తరగతులను తరలిస్తే సహించేది లేదని, అవసరమైతే ఉన్నత పాఠశాలగా మార్చాలని గ్రామం మొత్తం విలీనాన్ని వ్యతిరేకిస్తున్నారు. సీతాపురం ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే రైల్వే ట్రాక్, వంశధార ప్రధాన కాలువ దాటాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు.

- పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాలలో 84 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 6 నుంచి 8వ తరగతి వరకు 36 మంది విద్యార్థులు ఉన్నారు. పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ తరగతుల విలీనానికి చేసిన ప్రతిపాదనలను విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. వంశధార ప్రధాన కాలువతో పాటు నిర్మానుష్యమైన రోడ్డు మార్గం దాటి పోలవరం వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇలా అయితే ప్రైవేట్ విద్యా సంస్థలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టెక్కలి మండలం బొరిగిపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు



పెద్దసాన నుంచి పోలవరం ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ఈ వంతెన దాటాల్సిందే

- టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో సుమారు 29 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతుల విలీనానికి ప్రతిపాదనలు రూపొందించగా, కేవలం 2 చోట్ల మాత్రమే అంగీకారం తెలిపారు. మిగిలిన చోట్ల తీవ్ర వ్యతిరేకత చోటుచేసుకుంది. అలాగే మోడల్ ప్రైమరీ, ఫౌండేషన్ స్కూల్స్ విషయంలో అదే వ్యతిరేకత కనిపిస్తోంది.

తరలించొద్దు



మా పాఠశాలలో తరగతులను మరో పాఠశాలకు తరలిస్తామని చెబుతున్నారు. దీనివలన ప్రతీరోజూ ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. రైల్వే ట్రాక్ దాటాల్సిన ఇబ్బంది ఉంది. మా ఊరులోనే ప్రాథమికోన్నత పాఠశాల ఉండాలి. – బి.కుసుమ, 7వ తరగతి, బొరిగిపేట, టెక్కలి మండలం

తరలిస్తే చదువుకు దూరం



చుట్టుపక్కల సుమారు 10 గ్రామాలకు మా పాఠశాల ఎంతో ఆసరాగా ఉంది. ఇటువంటి పాఠశాలలో ప్రాథమికోన్నత తరగతులు తరలిస్తే మేము అంగీకరించం. విలీనం ప్రతిపాదన రద్దు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను విన్నవించాం. అన్ని రకాల సదుపాయాలు ఉన్న మా పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి. – ఎస్.ఢిల్లేశ్వరరావు, విద్యార్థి తండ్రి, బొరిగిపేట, టెక్కలి మండలం

తరలిపోతే ఇబ్బందులు



మా ఊరులో ఉన్న బడిలో 6, 7, 8 తరగతులు మరో బడికి తరలిస్తారని చెబుతున్నారు. ఇలా చేస్తే విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వంశధార కాలువతో పాటు ప్రమాదకరమైన రోడ్డు దాటి పోలవరం వెళ్లడానికి అనేక రకాల సమస్యలు ఉన్నాయి.
– పి.సరోజినమ్మ, విద్యార్థి తల్లి, పెద్దసాన, టెక్కలి మండలం

ఉపాధి వేతనదారుకి పాముకాటు



చికిత్స పొందుతున్న తులసి

నరసన్నపేట: మండలంలోని కోమర్తికి చెందిన ఉపాధి వేతనదారు పెరుమోల తులసి పాముకాటుకు గురైంది. పోలాకి చానల్‌లో గత వారం రోజులుగా ఉపాధి పని నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం ఉదయం పనికి అందరితో కలిసి తులసి కూడా వెళ్లింది. అయితే అక్కడ మట్టిని తొలగించేందుకు జంగిల్ తొలగిస్తున్నప్పుడు కాలికి పాము కరిచింది. వెంటనే అప్రమత్తమైన ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా రక్త పరీక్షలు చేసి అవసరమైన వైద్యమందిస్తున్నట్లు పేర్కొన్నారు.


ముద్దాయికి ఏడాది జైలు శిక్ష

పొందూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతికి కారణమైన ముద్దాయి లారీ డ్రైవర్ కిల్లాన శ్రీనుకు పొందూరు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. 2019వ సంవత్సరంలో పొందూరు మండలంలోని గారపేట గ్రామానికి చెందిన అంబళ్ల సంతోష్, చీమల మణికంఠలు బైక్‌పై వెళ్తుండగా, రెడ్డిపేట జంక్షన్ వద్ద లారీతో కిల్లాన శ్రీను ఢీకొనడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చీమల మణికంఠ తీవ్రగాయాలపాలైయ్యాడు. దీనిపై అప్పటి ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ లారీ డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పొందూరు కోర్టులో విచారణ జరగగా డ్రైవర్ శ్రీనుకు జడ్జి శిక్ష విధించారు.

టీచర్లపై ఒత్తిడి చేయడం తగదు

- ప్రతీ గ్రామంలో బేసిక్ ప్రైమరీ స్కూల్ ఉండాల్సిందే
- ప్రభుత్వానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల విజ్ఞప్తి

శ్రీకాకుళం న్యూకాలనీ:




వివిధ అంశాల్లో ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం ఎంతమాత్రం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామమూర్తిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా ప్రాథమిక పాఠశాలలు మరియు ప్రాథమికోన్నత పాఠశాలలను కుదించాలనే పన్నాగం చేస్తోందని మండిపడ్డారు. దీనికోసం గతంలో చేసిన ఎస్ఎంసీ తీర్మానాలకు విరుద్ధంగా, ప్రభుత్వానికి అనుకూల ఎస్ఎంసీ తీర్మానాలు చేసి అర్జెంటుగా ఆన్‌లైన్ చేయాలని ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పనిని పాఠశాలల హెచ్ఎంల కంటే విద్యాశాఖ అధికారులే నేరుగా రంగంలోకి దిగి తమకు కావాల్సినట్లుగా చేసుకుంటే ఉపాధ్యాయులకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఇప్పటికే ఎస్ఎంసీ తీర్మానాలు చేసి మండల విద్యాశాఖ అధికారులకు, జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. మరలా ఇప్పుడు ఒకపక్క విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండగా, ఎస్ఎంసీ తీర్మానాలు చేసి అప్‌లోడ్ చేయమని ఒత్తిడి చేయడం సమంజసమేనా అని ప్రశ్నించారు.

ప్రైమరీ స్కూల్ ఉండాలి

ప్రతీ గ్రామంలో బేసిక్ ప్రైమరీ స్కూల్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పంచాయతీ కేంద్రాల్లో కూడా మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసి, తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదు తరగతులకు ఐదు తరగతి గదులు, ఇతర మౌలిక వసతులను కల్పించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో పంచాయతీల్లో ఉన్న స్కూల్స్‌ను ఫౌండేషన్ స్కూల్స్ మార్చడం అనే ఆలోచన సరైనది కాదన్నారు. దీనివలన ప్రైవేటు విద్యకు రెడ్‌కార్పెట్ వేసినట్లు అవుతుందని ఆరోపించారు. అలాగే ఇప్పుడున్న ప్రాథమికోన్నత పాఠశాలలను అవకాశం ఉన్న దగ్గర 60+ రోల్ ఉంటే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి, మిగతా ప్రాథమికోన్నత పాఠశాలలను స్కూల్ అసిస్టెంట్లతో యథావిధిగా కొనసాగించాలని కోరారు.





నిన్న శిశిర రాగం.. నేడు వసంత గీతం

మేజరు పంచాయతీ నరసన్నపేట బజారు వీధిలో రావిచెట్టు పచ్చదనం పరుచుకోవడంతో అహ్లాదకరంగా కనువిందు చేస్తోంది. వారం క్రితం ఇదే చెట్టు ఆకులు రాల్చి మోడువారినట్లు కనిపించింది. ఇప్పుడు పచ్చటి ఆకులతో చూపరులకు అహ్లాదాన్ని పంచుతోంది.
– నరసన్నపేట

సాయిప్రియకు స్టేట్‌ఫస్ట్ ర్యాంక్



కింతలి సాయిప్రియ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రకటించిన రేడియోథెరపిస్ట్ ఎండీ పరీక్షలో శ్రీకాకుళం నగరానికి చెందిన కింతలి సాయిప్రియ స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. రేడియోలజీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని ఆమె తెలియజేశారు. తల్లిదండ్రుల సహకారంతోనే స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ సాధించగలిగానన్నారు. ఎంబీబీఎస్ కాకినాడ, ఎండీ, జీఎస్ఎల్ రాజమండ్రిలో పూర్తి చేసినట్లు తెలిపారు. సాయిప్రియ తల్లి గొండు వెంకటలక్ష్మి టీచర్‌గా పని చేస్తుండగా, తండ్రి కాళిదాసు బిజినెస్ చేస్తున్నారు. ఆమె చెల్లి అపర్ణ సైతం ఎంబీబీఎస్ పూర్తి చేశారు.

జగన్ భద్రతపై కూటమి కుట్రలు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్



టెక్కలి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతపై కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ధ్వజమెత్తారు. ఈ మేరకు టెక్కలిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. దీంతో ఏదో రకంగా అల్లర్లు సృష్టించి దానిని వైఎస్సార్‌సీపీ మీద నెట్టేయాలని కూటమి నాయకులు చూస్తున్నారని మండిపడ్డారు. దీనిలో భాగంగానే రామగిరి పర్యటనలో మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రతను కుదించారని దుయ్యబట్టారు. భద్రత విషయంలో ఎటువంటి తప్పిదాలు జరిగినా, దానికి పూర్తిస్థాయిలో ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్ టీడీపీ కార్యకర్తగా వ్యవహరించిన సంగతి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటే, ఆ విషయం హోంమంత్రి అనితకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, టీడీపీ నాయకులకు తొత్తులుగా పనిచేస్తున్న కొంతమంది పోలీసుల వలన పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వస్తోందన్నారు. దీనికి తగినమూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా వైఫల్యం చెందడంతో నడిరోడ్డుపై లింగమయ్యను హత్య చేశారని, దీంతో ఆ కుటుంబాన్ని జగన్ పరామర్శించడానికి వెళ్లగా, దానిపై హోంమంత్రి బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అలాగే ఒక మాజీ సీఎం భార్యపై నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడిన వ్యక్తిపై కేవలం నామమాత్రపు చర్యలతో వదిలేస్తున్నారని మండిపడ్డారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

- ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకుల డిమాండ్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు గురువారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరసన తెలిపారు. ఎన్ఎంయూ నాయకులు ఎన్‌వీఆర్ మూర్తి, ఎంఎస్ రాజు, వి.శాంతరాజులు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనాలన్నారు. పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు నవీన్‌బాబు, వీరబాబు, వీడీ రావు, ఎంఎస్‌సీ రావు, పార్వతి, అప్పలనరసమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ధర డమాల్..!



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పనస కాయలు

- అమాంతం తగ్గిపోయిన పనస ధర
- ఆందోళనలో రైతులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో పనస పంటకు అనూహ్యంగా ధర తగ్గిపోయింది. దీంతో రైతులు దిగాలు పడుతున్నారు. ఈ ఏడాది జనవరిలో పనస కిలో ధర రూ.32లు ఉండగా, ఇప్పుడు హఠాత్తుగా కిలో రూ.6 లకు చేరుకుంది. దీంతో లాభాలు వస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఒకేసారి అన్ని తోటల్లో ఇప్పుడు దిగుబడులు వచ్చాయి. దీంతో రైతులు గ్రామాల్లో దళారీలకు విక్రయిస్తున్నారు. వారు పలాస మార్కెటుకు తీసుకొచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. నవంబర్ నుంచి ఈ పంట క్రయవిక్రయాలు జరుగుతున్నా మొదట్లో తగిన బరువు రాలేదు. దీంతో కొద్దిగా ముదిరితే ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని ఆశించిన రైతులు ఇప్పుడు ఒకేసారి ధరలు తగ్గడంతో లబోదిబోమంటున్నారు.



పలాస నియోజకవర్గంలో...

పలాస నియోజకవర్గంలోని పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని జీడి కొబ్బరి తోటల్లో పనస అంతరపంటగా సాగవుతోంది. జీడి పంటకు ముందుగానే పనస కాపునకు వచ్చి రైతు చేతికి కొంత డబ్బులు చేకూర్చుతాయి. దీంతో కొంతమంది రైతులు వీటిని అమ్మి జీడి పంటకు పెట్టుబడులు కూడా పెడతారు. కొంతమందికి ఇదే ఆర్థిక ఆసరాగా ఉంటుంది. ప్రతీ ఏడాది నవంబర్ నుంచి ఆ తర్వాత ఏడాది ఏప్రిల్, మే నెలల వరకు ఈ పంటకు మార్కెటులో గిరాకీ ఉంటుంది. మే నెల తర్వాత పనస పండ్ల సీజన్ వస్తుంది. చెట్లల్లో మిగిలిన కాయలను పండ్లుగా చేసి అమ్ముతారు. అయితే ఎక్కువ ధర జనవరిలో ఉండడంతో చిన్న చిన్న కాయలు కూడా తీసి లాభసాటిగా అమ్ముకున్నారు. అప్పుడు అమ్మని వారికే ఇప్పుడు ఎక్కువ నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతగా ఈ ధర దిగజారిపోవడానికి కారణాలు ఏమిటో తెలియక నిరాశ చెందుతున్నారు.

ఆశ్చర్యంగా ఉంది



ఈ ఏడాది ఇప్పుడే పనస పంట ఒకేసారి చేతికి రావడంతో ధర తగ్గిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. ఇది ఎంతవరకు నిజమో వారికే తెలియాలి. జనవరిలో రూ.32లు ఉండగా, ఇప్పుడు రూ.6లకు పడిపోవడం ఆశ్చర్యంగా ఉంది. తక్కువ ధర అయినా అమ్ముకోక తప్పడం లేదు. ఎప్పుడూ చెమటోడ్చి కష్టించిన రైతులకే నష్టం కలుగుతుంది. వ్యాపారులకు బాగానే ఉంది.
– పాలిన దేవరాజు, బాహడపల్లి, మందస మండలం

ఒకేసారి ధర తగ్గలేదు



మొదట్లో ధర బాగానే ఉంది. నవంబర్, జనవరి వరకు కిలో రూ.32లు ఉండగా, ఫిబ్రవరిలో రూ.25లు అయింది. ఆ తర్వాత మార్చి నుంచి క్రమేపీ తగ్గిపోయింది. దీనికి కారణం ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, సీతంపేట, తుని, రాజమండ్రి ఇతర ప్రాంతాల నుంచి ఉత్తర భారతదేశానికి ఎగుమతులు పెరిగాయి. దీంతో డిమాండ్ కన్నా సరఫరా ఎక్కువ కావడంతో ధర అమాంతంగా పడిపోయింది. ఇందులో వేరే కారణాలు లేవు
– అచ్యుత పాత్రో, పనసకాయల వ్యాపారి

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం, మండలంలోని పలు ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే కొత్తగా వెలుస్తున్న లే అవుట్లు, ప్రైవేటు నిర్మాణాలకు కొంతమంది యథేచ్ఛగా మట్టి అక్రమంగా రవాణా చేస్తున్నారు. అలాగే పురపాలక సంఘం పరిధి రత్తకన్న గ్రామంలోని కొండల నుంచి గ్రావెల్, బాహుదా నదీతీర ప్రాంతాల నుంచి ఇసుక, పొలాల నుంచి మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్ మీదుగానే అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రెవెన్యూ అధికారులు గానీ, సంబంధిత అధికారులు గానీ నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తుండడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌తో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న దృశ్యం